వెంటాడుతున్న సమస్యలు

- మంజూరైన సబ్ డివిజనల్ ఆఫీసు ఎక్కడో?
- భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- నామాపూర్ పూర్వ సెక్షన్ కార్యాలయం శిథిలం
- అద్దె ఆఫీసు కోసం వెతుకులాట
- సాగునీటి ఇబ్బందులు తొలగేనా?


శిథిలావస్థలో పాత ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయ భవనం

ముస్తాబాద్: మెరుగైన సాగునీటి సరఫరాకు ప్రభుత్వం ముస్తాబాద్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈమేరకు రెండు రోజుల క్రితమే డీఈఈ, ఇద్దరు ఏఈఈలు బాధ్యతలు స్వీకరించారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ముస్తాబాద్‌కు ప్రత్యేక డివిజనల్ కార్యాలయం మంజూరుకు కృషి చేశారు. సబ్ డివిజనల్ కార్యాలయం కార్యకలాపాలు ఇక్కడి నుంచి నిర్వర్తించేందుకు సన్నద్ధం అవుతుండగా, కార్యాలయం సమస్యలు సిబ్బందిని వెంటాడుతున్నాయి. అయితే ముస్తాబాద్ మండల కేంద్రంలో అద్దె భవనాలు నీటిపారుదల శాఖ బడ్జెట్‌కు మించి ఉండడం ఆ శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. గతంలో ఎగువ మానేరు ప్రాజెక్టు సెక్షన్ ఆఫీసున్న నామాపూర్ బంగ్లాలోనే కార్యాలయం ఏర్పాటుకు ఆ శాఖ అధికారులు పచ్చజెండా ఊపారు. దీంతో అక్కడ కార్యాలయం ప్రారంభానికి అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

నిజాం కాలంనాటి భవనం

ఎగువ మానేరు ప్రాజెక్టు నిర్వహణ అంతా ముస్తాబాద్ మండలం నామాపూర్‌లోని కార్యాలయం నుంచే నిర్వహించేవారు. ఏడో నిజాం ఈ ప్రాజెక్టును నర్మాలలో నిర్మించి, కార్యనిర్వహణ భవనాన్ని మాత్రం నామాపూర్‌లో నిర్మించారు. అయితే 75 ఏళ్లు పూర్తిచేసుకున్న కార్యాలయం ఆలనాపాలన కరువై ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఒకప్పుడు ఇక్కడే ఒక డీఈఈ, నలుగురు ఏఈలు, పదుల సంఖ్యలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు విధులు నిర్వర్తించేవారు. కాని గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఒక ఏఈ, ఒక వర్క్‌ఇన్‌స్పెక్టర్ మాత్రమే మిగిలారు. తాజాగా ప్రభుత్వం సబ్‌డివిజనల్ కార్యాలయం మంజూరుతో మరోసారి నామాపూర్‌వైపు అందరి దృష్టి మరలింది. ఇక్కడి కార్యాలయంలో గతంలో రెండు వంట గదులు, డైనింగ్ హాల్స్, రెండు విశ్రాంతి గదులు, ఇద్దరు అధికారులకు ప్రత్యేక గదులు ఉండేవి. విశాలమైన ప్రాంగణంలో ప్రశాంత వాతావరణంలో ఉండేది. ప్రస్తుతం భవనం బాగోగులు చూసేవారు లేక పూర్తిగా శిథిలమైంది. రెండు గదులు మాత్రమే కూర్చుండే వీలు కలిగి ఉంది. అలాగే కార్యాలయం ముందు భాగంలో ఇష్టానుసారంగా డ్రెయినేజీ నిర్మించారు. అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. రానురాను కార్యాలయం స్థలం అన్యాక్రాంతం అవుతోందని ఆ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

రెండు గదుల్లో కార్యాలయం

నామాపూర్ సబ్ డివిజనల్ కార్యాలయంలో రెండు గదులు రిపేరు చేయాలనే ప్రతిపాదన చేశారు. కరెంట్, కిటికీలు, తలుపులు బాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మైనర్ రిపేర్లు చేసి వారం రోజుల్లో ప్రారంభించనున్నారు. ఇక్కడ డీఈఈ, ఇద్దరు ఏఈఈలు, ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎల్‌డీసీ, 15 మంది లష్కర్లు పనిచేయనున్నారు. ముస్తాబాద్ మండల పరిధిలోని 22 గ్రామాల్లో 25 వేల ఎకరాలకు సాగునీరందించే 58 చెరువులు, కుంటలు, మానేరు ప్రాజెక్టు కెనాల్ 21 కిలోమీటర్ల పర్యవేక్షణ, మల్లన్నసాగర్ కెనాల్, నక్కవాగు పరివాహక ప్రాంతం పర్యవేక్షణ చేపట్టనున్నారు.

ప్రతిపాదనలకు మోక్షమెప్పుడో?

నామాపూర్ సెక్షన్ ఆఫీసును కూల్చివేసి, శాశ్వత కార్యాలయం నిర్మాణానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. రెండేళ్ల క్రితమే చేసిన ప్రతిపాదనలకు ఇంకా మోక్షం లభించలేదు. వారం రోజుల క్రితం ఆ శాఖ ఈఎన్‌సీ కూడా శిథిలమైన కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. గెస్ట్‌హౌజ్‌తోపాటు కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు. సబ్ డివిజన్ ఆఫీసు ఏర్పాటుతో రైతుల నీటిగోస త్వరగా పరిష్కారం అవుతుందని అన్నదాతలు ఆశిస్తున్నారు.

రైతులకు లాభం



నీటిపారుదలశాఖ కార్యాలయం ఒకప్పుడు నామాపూర్‌లో చాలా బాగుండేది. ప్రస్తుతం శిథిలమైంది. మంత్రి కేటీఆర్ చొరవతో సబ్‌డివిజన్ కావడం సంతోషం. రైతులకు లాభం చేకూరుతుంది. కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుత భవన రిపేర్లకు సహకరిస్తాం.

– వెల్ముల విజయ, సర్పంచ్, నామాపూర్

కేటీఆర్‌కు రుణపడి ఉంటాం



ముస్తాబాద్‌కు నీటిపారుదల శాఖ సబ్‌డివిజన్ మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు రైతులు ముందుగా రుణపడి వుంటారు. సాగునీటి సమస్యల పరిష్కారానికి ఆఫీసు రానుంది. శాశ్వత భవన నిర్మాణానికి మంత్రికి విజ్ఞప్తి చేశాం. త్వరలో కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారు.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, అధ్యక్షుడు, రైతుబంధు సమితి

తాత్కాలికంగా ఏర్పాటు చేస్తాం



నామాపూర్‌లో పురాతన ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలోనే రెండు గదులు రిపేరు చేయించి కార్యాలయం పనులు ప్రారంభిస్తాం. శాశ్వత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. రైతులకు నిరంతరం సాగునీటిని అందించేందుకు కృషి చేస్తాం. సెక్షన్ కార్యాలయాన్ని కాపాడేందుకు సహకరించాలి.

– ఎం.రవికుమార్, డీఈఈ, ముస్తాబాద్

క్లుప్తంగా

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: మండలంలోని ప్రజలందరూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచిత కంటి వైద్యం గ్రామాల్లోనే అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సర్పంచులు జితేందర్ గౌడ్, పర్శరాం, భాగ్యలక్ష్మి, ఇల్లంతకుంట ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య పాల్గొన్నారు.

సంఘ భవనానికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ పంచాయతీ పరిధిలోని రేగులపల్లిలో యాదవ సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆ సంఘం నాయకులు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వినతిపత్రం అందచేశారు. సర్పంచ్ ఇల్లెందుల శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. అలాగే మల్లాపూర్ గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని యువకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీభక్తఅంజనేయస్వామి ఆలయంలో 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉమాశంకర్ అంజనేయస్వామి శివ పంచాయతనంకు అభిషేకం, నవగ్రహపూజ, హోమం నిర్వహించారు. సుమారు వేయిమందికి అన్నదానం చేశారు. స్వామివారిని సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు మార్కండేయ, లక్ష్మీనారాయణ, రాము, మెగి నర్సయ్య, లక్ష్మణ్, దేవేందర్, దాసు, గాండ్ల అంజనేయులు, సత్యం, భాస్కర్, పురుషోత్తం, కృష్ణారెడ్డి, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు - ఎన్నికలు

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా కార్తీక్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గంట కార్తీక్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేటలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ముస్తాబాద్: మండలం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్, ట్రాక్టర్, డోజర్‌ను మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి తెలిపారు. పక్కా సమాచారం మేరకు ముస్తాబాద్ మండలం రాంరెడ్డిపల్లె, నామాపూర్ సోలార్ ప్లాంట్ వద్ద డంపు చేసిన ఇసుకను టిప్పర్, ఒక ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న డోజర్‌ను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తదుపరి చర్యలకై అప్పగించినట్లు తెలిపారు. అలాగే వాహన యజమానులు, డ్రైవర్లు పోతుగల్‌కు చెందిన కొదాటి రజనీకాంత్, బాబు, రాంరెడ్డిపల్లెకు చెందిన నవీన్, కొండాపూర్‌కు చెందిన రాజుపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కోనరావుపేట: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వేములవాడ ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

వేములవాడరూరల్: వేములవాడ సింగిల్‌విండో ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని బాలనగర్ వార్డులో ధాన్యం కొనుగోళ్లను ఎమ్మెల్యే రమేశ్ బాబు బుధవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాములు

చందుర్తి: కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విస్మరిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామంలోని ఒడ్డెర కాలనీలో సీపీఐ జాత వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిననాటి నుంచి నిత్యావసర సరుకులు ధరలు నాలుగింతలు పెరగడంతో పేదల బతుకు భారంగా మారిందన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన విద్యార్థి సంఘాల నాయకులు

కోనరావుపేట: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికాంత్‌ను పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. రెవెన్యూ, ధరణి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మల్కపేట రిజర్వాయర్‌తో సస్యశ్యామలం


వేములవాడ అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- అధికారులతో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సమీక్ష

వేములవాడ: మెట్టప్రాంతమైన కోనరావుపేట మండలాన్ని మల్కపేట రిజర్వాయర్ సస్యశ్యామలం చేయనుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ప్యాకేజీ–9 రిజర్వాయర్ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వేములవాడ మండలం చంద్రగిరి, జయవరం, లింగంపల్లి, మారుపాక, తిప్పాపూర్‌లలో 5,601 ఎకరాలు, కోనరావుపేట మండలం ధర్మారం, కనగర్తి, కొలనూర్, పల్లిమక్త, మల్కపేట, మర్తనపేట, నాగారం, నిజామాబాద్, రామన్నపేట, సుద్దాలలో 25,694 ఎకరాలకు కొత్త ఆయకట్టు స్థిరీకరణపై ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లు, ప్యాకేజీ–9 ఈఈ శ్రీనివాస్‌రెడ్డితో చర్చించారు. వీరితోపాటు కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వేములవాడ అభివృద్ధిపై సమీక్ష

వేములవాడ పట్టణంలో 1200 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, బ్రిడ్జి నుంచి రాజన్న గుడి వరకు రోడ్డు వెడల్పు, కట్ట కింద బస్టాండ్ నిర్మాణంపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. డబుల్ బెడ్రూమ్‌లకు స్థల సేకరణ, లబ్ధిదారుల ఎంపిక నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 15 రోజుల్లోగా సంపూర్ణ కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆర్డీవో పవన్‌కుమార్, జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, సిరిసిల్ల టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారి, ఎమ్మార్వో రాజారెడ్డి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ శాంతయ్య, వీటీడీఏ ఎస్టేట్ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు



కోనరావుపేట: మండలం ధర్మారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనమెత్తుకుని, బైండ్ల కళాకారుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మకు నైవేద్యంగా సమర్పించారు. ఈ వేడుకలో గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నాగరాజు, ప్రధానకార్యదర్శి అతికం శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి


ముస్లిం పెద్దలతో సమావేశమైన తహసీల్దార్

ఎల్లారెడ్డిపేట: రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ జయంత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల వారీగా రంజాన్ కానుకలు తీసుకునేందుకు అర్హుల జాబితాను కార్యాలయంలో అందించాలని సూచించారు. ప్రతీ పేదవారు పండుగను జరుపుకునేందుకు ప్రభుత్వం కానుకలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు గౌస్, జాంగీర్, షాబీర్ పాల్గొన్నారు.

కుప్పల తెప్పలుగా ధాన్యం

- కొనుగోళ్ల కోసం ఎదురుచూపు
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- రైతుల గుండెల్లో మొగులు గుబులు


తడగొండ కేంద్రంలో కుప్పలుగా ధాన్యం

బోయినపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి, రైతులు కుప్పలుగా పోస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఎదురుచూస్తున్నారు. పక్షం రోజుల నుంచి గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలివస్తోంది. బోయినపల్లి మార్కెట్ యార్డులో ఎటు చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. అలాగే తడగొండ, అనంతపల్లి, విలాసాగర్, మల్కాపూర్ గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. ఓవైపు మొగులు అవుతుండడంతో, త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు. కాగా బార్‌దాన్, రైస్ మిల్లుల కేటాయింపు సౌకర్యం లేకపోవడంతో కొనుగోళ్లలో ఆలస్యం అవుతోందని అంటున్నారు.

13వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలో 23 గ్రామాలు ఉన్నాయి. వానకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో యాసంగిలో వరి సాగుకు రైతులు మొగ్గు చూపారు. మండలంలోని 24,870 ఎకరాలుండగా, యాసంగిలో 13,190 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 33 వేల మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఎంఏవో ప్రణీత తెలిపారు.

ప్రారంభం కాని కేంద్రాలు

మండలంలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. బోయినపల్లి, కోరెం, మాన్వాడ, నర్సింగాపూర్ గ్రామాల్లో సింగిల్‌విండో సొసైటీలు ఉన్నాయి. పీఏసీఎస్‌తో పాటు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రతీసారి ధాన్యం కొనుగోళ్లు చేపడుతారు. బోయినపల్లి మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2,060 మద్దతు ధర చెల్లిస్తారు. తేమ శాతం 17 రావాలి. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో విలాసాగర్, తడగొండ తదితర గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

ధాన్యం పోసి పది రోజులయితాంది



ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది రోజుల కిందట సుమారు 40 క్వింటాళ్ల ధాన్యం పోశా. ఇప్పటికీ కేంద్రం ప్రారంభించలేదు. వర్షం భయంతో రాత్రిపూట కవర్లు కప్పుతున్నాం. ఉదయం తీస్తున్నాం. రోజూ ఇదే పని అయితాంది.

– కట్ట బాబు, తడగొండ

త్వరగా ప్రారంభించాలి



మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. బోయినపల్లి మార్కెట్ యార్డులో సుమారు 15 లారీల మేర ధాన్యాన్ని పోశారు. ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– బోయిని ఎల్లేశ్

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం



బోయినపల్లి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరో రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు సంబంధించి రైతులకు అన్ని రకాల వసతులు సమకూర్చడం జరిగింది. నూతనంగా పోల్లు వేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది.

– లింకల సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్, బోయినపల్లి

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ ఎంఈవోకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బస్టాండ్ సమీపంలో మూతపడిన ఓ ప్రైవేటు కళాశాల భవనంలో ప్రైవేటు యూపీఎస్ స్కూల్‌ను నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలుడి చికిత్సకు ఆర్థికసాయం

తంగళ్లపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని మండెపల్లి గ్రామం కేసీఆర్‌నగర్ కాలనీకి చెందిన పోగుల అజయ్ అనే బాలుడి కుటుంబానికి సర్పంచ్ గణప శివజ్యోతి రూ.10 వేల ఆర్థికసాయం మంగళవారం అందించారు. అజయ్‌కి ఉచితంగా చికిత్స అందించేందుకు మంత్రి కేటీఆర్ స్పందించారని తెలిపారు.

కంటివెలుగు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూర్‌పల్లిలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ అజ్మీరా మంజుల ప్రారంభించారు. తండావాసులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు అందించారు.

అన్నదానం

వేములవాడ: రాజన్న ఆలయ పరిసరాల్లోని పేదలకు మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం 150 మందికి అన్నదానం నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, నాగుల చంద్రశేఖర్, పాత సంతోష్, పాలాస రాజేందర్, చల్లా సత్తయ్య, ప్రతాప నటరాజ్, ప్రసాద్, గుమ్మడి కుమార్, రాజు తదితరులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో పలువురు లబ్ధిదారులకు సర్పంచ్ తన్నీరు గౌతంరావు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ నాంపెల్లి మంజుల, నాయకులు రమేశ్, బాలనర్సయ్య పాల్గొన్నారు.

'బలగం' పెద్ద మనిషికి సన్మానం

కోనరావుపేట: బలగం సినిమాలో పెద్దమనిషిగా నటించిన మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు, కీసరి నర్సింగంను ఆధ్య ఫౌండేషన్ చైర్మన్ గోలిమోహన్ సన్మానించారు. రంగస్థల ప్రదర్శనలు, నాటక ప్రదర్శనల్లో నటనా చాతుర్యం చాటారన్నారు.